www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 3 నవంబర్ 2024
5
వైఎస్ఆర్

## రేపు విఆర్ఎల సమస్యలపై ఆందోళన

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జిల్లాలో గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని ఈనెల 4న కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపి విఆర్ఎ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా కోశాధికారి ఆశోక్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎనిమిదేళ్లుగా విఆర్ఎలకు వేతనాలు పెంచలేదని పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా నైట్ డ్యూటీలు వేస్తున్నారని తెలిపారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. నామినీలుగా గుర్తించాలని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. ధర్నాను జయప్రదం చేయాలని తెలిపారు.

# మొక్కుబడిగానే..!

- స్టాండింగ్ కమిటీ సమావేశంలో కరువుపై నిలదీత
- షాదీఖానా ఖర్చుల దుర్వినియోగంపై ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశం మొక్కుబడిగా ముగిసింది. శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జేష్ఠాది శారద అధ్యక్షతన జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సంబంధిత కమిటీ ఆయా శాఖల అధికారులతో ప్రోగ్రెస్‌ను సమీక్షించాలి. స్టాండింగ్ కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో కసరత్తు చేసి లోపాలపై ప్రశ్నించాలి. సంబంధిత అధికారుల నుంచి సమాధానాలు రాబట్టుకుని, లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలి. సమీక్ష అనంతరం ఆయా శాఖల అధికారులు విధుల నిర్వహణకు వెళ్లి పోవడం పరిపాటి. జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో శాఖల సమీక్ష పూర్తి చేసుకున్న కొందరు అధికారులు తీరికగా ఆశీనులు కావడం ఆశ్చర్యపరిచింది. కడప జిల్లాను కరువు మండలాల జాబితాలో లేకపోవడానికి జిల్లా వ్యవసాయశాఖ సమాధానం చెప్పాలని జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, సుమారు 10 మండలాలకుపైగా లోటు వర్ష పాతం నెలకొందని, ఫలితంగా పంటల సాగు లక్ష్యాన్ని చేరని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లాలోని షాదీఖానాలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయని విమర్శించారు. షాదీఖానా నిర్వహణ ఖర్చుల వినియోగంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. షాదీఖానా నిర్వహణ ఖర్చులు దుర్వి యోగా నికి పాల్పడిన వారికి నోటీసులు జారీ చేసి రికవరీ చేయాలని నిలదీశారు. దీనికి వక్ఫ్‌బోర్డు అధికారులు స్పందించి జిల్లాలో 12 షాదీఖానాలు ఉన్నాయని, నిర్వహణ ఖర్చుల వినియోగంలో చేతివాటం ప్రదర్శించిన వారికి నోటీసులు జారీ చేసి, రికవరీ చేస్తామన్నారు. అనంతరం పోరుమామిళ్ల జడ్‌పిటిసి అసంపూర్తిగా నిలిచిన అంగన్వాడీ భవన నిర్మాణాలకు జడ్‌పి నిధులతో పూర్తి చేస్తామని చెబితే బిల్లులు చేయలేమని చెబుతున్నారని నిలదీశారు. కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య, సిఇఒ, డిప్యూటీ సిఇఒ, పలువురు జడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

# ఏ ఒక్క మండలం లేకపోవడం దారుణం

**- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఎన్‌డిఎ, టిడిపి ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కడప జిల్లాలోని ఏ ఒక్క మండలం కూడా లేకపోవడం చూస్తుంటే, రాజకీయ కక్ష సాధింపు ధోరణితో కనపడుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7 నియోజకవర్గాల్లో 5 నియోజకవర్గాల్లో టిడిపిని ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. కెసి కెనాల్ పరివాహక 8 మండలాలు మినహా జిల్లా అంతట కరువు తాండవిస్తోందని తెలిపారు. కరువు నివేదికను అధికారులు గుడ్డిగా ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. జిల్లాలోని 28 మండలాలలో పంటల దిగుబడి 25 శాతం లోపే ఉందని, వర్షపాతం 98.5 మిల్లీమీటర్లు లోపు ఉంటే కరువు మండలాలుగా ప్రకటించాలని నిబంధనలు తెలుపుతున్నప్పటికీ జిల్లాలోని 28 మండలాలలో 33 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసిందని వాతావరణ శాఖ తెలిపినట్లు గుర్తు చేశారు. రుతుపవనాలు సక్రమంగా రాకపోవడంతో 16 రకాల పంటలు క్షేత్రస్థాయిలో ఎండిపోయాయని తెలిపారు. వరి, పత్తి, జొన్న, మినుము, కంది, సాగు విస్తీర్ణం జిల్లాలో ప్రతి ఖరీఫ్ సీజన్లో 1 లక్ష 50 వేల హెక్టార్లకు పైగా సాగులో ఉండగా, ఈ ఏడాది కేవలం 80 వేల హెక్టార్ల లోపే సాగు చేశారని,

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

వారికి కూడా దిగుబడి 25 శాతానికి మించి రాలేదని, క్షేత్రస్థాయి సర్వే ఇలా ఉండగా తప్పుడు నివేదికలు అధికారులు ఎలా పంపుతారని, ఇది ఉద్దేశపూర్వకంగా మాజీ సిఎం జిల్లా కావడం వల్ల రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేశాయని జిల్లా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.. కడప జిల్లాలో కరువు మండలాలను ప్రకటించకపోతే పోరాటం తప్పదని, ఈనెల 15న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా రైతులు ప్రజా పోరు నిరసన నిర్వహించకముందే జిల్లాలోని 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, వి.అన్వేష్ పాల్గొన్నారు.

## ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలి

**ప్రజాశక్తి- కడప అర్బన్**

మంత్రి కి వినతి పత్రం అందజేస్తున్న రూట నాయకులు

త్వరలో డిఎస్‌సి ద్వారా నిర్వహించబోయే పోస్టుల భర్తీలో ఉర్దూ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఉర్దూ పాఠశాలలలో చదువుతున్న ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయాలని న్యాయ, చట్టం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫారూఖ్‌కు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర వ్యవ స్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫైజీ వినతి పత్రం సమర్పించారు. 15 ఏళ్లుగా దాదాపు ఉర్దూ మీడియం సబ్జెక్టుల ఉపాధ్యాయ పోస్టులన్నీ బ్యాక్లాగ్‌లో చూపుతున్నారని దీంతో ఉర్దూ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మంత్రి స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామని, ఉర్దూ పాఠశాలలకు, కళాశాలలకు మహర్దశ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు అమీర్ బాబు, జీలాని బాషా, సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, ఉర్దూ డిఐ హస్ముద్దిన్, రూట రాష్ట్ర కో- ఆర్డినేటర్ ముహమ్మద్ అయ్యుబ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జీకే కలీం, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైఫుల్లా, అబ్దుల్ కలాం, రాష్ట్ర నాయకులు జానీ బాషా, దస్తగీర్ బాషా, జిల్లా నాయకులు యూనుస్, కలిముల్లా, అస్లం, హనీఫ్ పాల్గొన్నారు.

## శ్రీఅమోఘ హోండా షోరూంలో లక్కీడ్రా

**ప్రజాశక్తి-కాశినాయన**

విజేతకు బహుమతి అందజేస్తున్న షోరూమ్ యజమాని రవీంద్రారెడ్డి

స్థానిక శ్రీ అమోఘ హోండా షోరూంలో దీపావళి, దసరా సందర్భంగా బైకులు తీసుకున్న వారికి బహుమతులు ప్రకటించారు. ఇందులో శనివారం లక్కీ డ్రా తీశారు. మొదటి బహుమతి నర్సాపురం గ్రామానికి చెందిన జి.యోగా లక్ష్మి, రెండవ బహుమతి కవలకుంట్ల గ్రామానికి చెందిన కె. ప్రభావతి మూడో బహుమతి చింతల పల్లె గ్రామానికి చెందిన కె. శైలజ లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచారు. వారికి షోరూం యజమాని బి.రవీంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సందర్భంగా తమ షోరూంలో బైకులు కొనుగోలు చేసిన వారికి బహుమతులు అందించడం సంతోషంగా ఉందన్నారు. గెలుపొందిన వారికి అభినందనలు తెలిపారు. తమ షోరూంలో వివిధ రకాల బైకులు సరసమైన ధరలకే లభిస్తాయని చెప్పారు. విని యోగదారులు కొనుగోలు చేసి తమ వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.

## రిమ్స్‌లో జిమ్ పునఃప్రారంభం

**ప్రజాశక్తి - కడప సిటీ**

జిమ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న చందంగా వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బందికి రిమ్స్‌లో మెడికల్ కళాశాలలో నూతన పరికరాలతో ఏర్పాటు చేసిన జిమ్‌ను శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ పునః ప్రారంభించారు. ప్రతి ఒక్క విద్యార్థి, సిబ్బంది వ్యాయామశాలను ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర రెడ్డి, అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి లక్ష్మీ నరసమ్మ అధ్యాపక సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌జెడికి సన్మానం

**ప్రజాశక్తి - కడప :** ఇటీవల కడప, చిత్తూరు జిల్లాల కళాశాలల ఆర్జేడిగా బాధ్యతలు స్వీకరించిన డి.గిరిని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జిసిటిఎ) నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్. కృష్ణారెడ్డి, అధ్యక్షులు డాక్టర్ శశికాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డాక్టర్ నీలయ్య, ఆర్థిక కార్యదర్శి డాక్టర్. రామకృష్ణ సంఘ నాయకులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్. ఎం వి. సురేష్ బాబు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

**ప్రజాశక్తి - కడప :** కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం బద్వేలు అసెంబ్లీ నియోజకవర్గం, అట్లూరు మండలం, కామసముద్రం గ్రామానికి చెందిన టి.సుబ్బా రెడ్డి, గోపవరం మండలం చెర్లోరామపురం గ్రామానికి చెందిన నరసింహ యాదవ్ వారి అనుచరులతో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి.విజయ జ్యోతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం, జాతీయత, సామాజిక న్యాయం, సమానత్వం కలిగిన అభివృద్ధి కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని చెప్పారు. 2029 ఎన్నికల్లో వైఎస్ఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ విజయానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో చెప్పలి పుల్లయ్య, బోవిళ్ల మధుసూదన్ రెడ్డి, సయ్యద్ సలావుద్దీన్, శివ కోటి రెడ్డి, సంగటి చిన్న సుబ్బారెడ్డి, సిరాజుద్దీన్, గౌస్ పీర్, హరిప్రసాద్, గఫార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

## అవినీతి రహిత దేశం అందరి లక్ష్యం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** అవినీతి రహిత భారతదేశం అందరి లక్ష్యమని, దాని కోసం అందరూ కృషి చేయాలని యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 9 ప్రోగ్రాం ఆఫీసర్, ఎంసిఎ విభాగ సహ ఆచార్యులు డాక్టర్ కె.శ్రీనివాస రావు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో అవినీతిరహిత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో అవినీతి వల్ల ఎన్నో అక్రమ కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్ డిపార్ట్మెంట్ ఆఫ్ సిఎస్‌టి.డాక్టర్ కృష్ణయ్య, జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకులు ఎం.అశోక్, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది ప్రేమ్ కుమార్, మల్లికార్జున, వైవీయూ విద్యార్థులు పాల్గొన్నారు.

## అపార్ సమస్య పరిష్కరించాలి

**ప్రజాశక్తి -కడప అర్బన్**

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న మేకల శివార్జున

విద్యార్థులకు అపార్ ఐడి నెంబర్ ఉత్పత్తి చేసేటప్పుడు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఇఒను సంఘ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేకల శివార్జున మాట్లాడుతూ డిఇఒ జిల్లాకు రావడం తమకు సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులమీద ఒత్తిడి లేకుండా చేయాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించేటప్పుడు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, కార్యదర్శులు సి.సురేంద్ర, కె. జయరాం పాల్గొన్నారు.

## విధులు సక్రమంగా నిర్వహించాలి : ఎస్‌పి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విధులు నిర్వహించాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లాలోని కడప తాలూకా, సైబర్ క్రైమ్ సెల్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ లో ఉన్న సిబ్బంది లో నైపుణ్యాలను గుర్తించి వారికి తగిన విధులు కేటాయించాలని తాలూకా సి.ఐ వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. ఫిర్యాదులపై సరైన రీతిలో క్షుణ్ణంగా విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.

## పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి-కడప రూరల్**

సిఎం చంద్రబాబుకు బొకే అందజేస్తున్న నాయకులు

ఎపి పింఛను దారుల కార్పొరేషన్ ఏర్పాటు హామీకి చర్యలు తీసుకోవాలని ఎన్‌జిఒ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి పి.ఓబులేసు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 17వ తేదీన రాష్ట్ర పింఛనుదారుల దినోత్సవాన్ని నిర్వహించాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు కోల్పోయిన రాయితీలు, ప్రోత్సాహకాలను పునరుద్ధరించాలని కోరుతూ పింఛనుదారుల ఆలిండియా పెన్షనర్ల సంఘం జనరల్ సెక్రటరీ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఇటీవల సిఎం చంద్రబాబునాయుడును కలిశామని పేర్కొన్నారు. పింఛనుదారుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సిఎం హామీ ఇచ్చారని తెలిపారు. కమ్యూనికేషన్ కాలాన్ని 15 నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. ఇహెచ్ఎస్ కార్డులపై నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు. పింఛనుదారులపై ఉద్యమ కాలంలో ఉన్న కేసులను ఎత్తివేయాలని తెలిపారు. 11వ పిఆర్‌సి సవరించి 12వ పిఆర్‌సిని నియమించి పెండింగ్ డిఎలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## నగరంలో సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌస్‌పీర్

నగరంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు పీస్ సయ్యద్ గౌస్ పీర్ కోరారు. శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ పీర్ మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ఉన్న బుగ్గవంక దోమల ఉత్పత్తి కేంద్రంగా మారి, పరివాహక ప్రాంతాల్లో పగటి పూట దోమలు విజృంభిస్తూ ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తున్నామని పేర్కొన్నారు. బుగ్గవంకలోకి మురుగునీరు చేరి, కంప చెట్లు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిందని తెలిపారు. దీనికి తోడు జంతువులు, చికెన్ వ్యర్థాలను వేస్తుండటంతో ఒకటే దుర్వాసన వెదజల్లు తోందన్నారు. నిపరివసానం సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని తెలిపారు. పీస్ కాలనీ లో రోడ్డు లేక 141 ప్లాట్ యజ మానులు, స్కూల్ యాజమాన్యం తీవ్రంగా బాధపడుతున్నారని పేర్కొన్నారు. వీటిపై దృష్టి సారించి వెంటనే రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు.

## ప్రతి విద్యార్థికి అపార్ తప్పనిసరి : డిఇఒ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికీ అపార్ నమోదు తప్పనిసరి అని డిఇఒ మీనాక్షి ఆదేశించారు. శనివారం కడప నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీ పాఠశాలలో ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్లు ప్రిన్సిపల్స్, హెడ్మాస్టర్ల సమావేశం కడప మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికీ అపార్ నమోదు చేయడం వల్ల విద్యార్థికి ఒక ధ్రువీకరణ నంబర్ వస్తుందని చెప్పారు. దీని ఆధారంగా రాబోయే రోజుల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని విద్యా వస్తువులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల అపార్ నమోదు సోమవారం సాయంత్రం కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. అ నమోదులో నిర్లక్ష్యం వహించే యాజమా న్యాలపై చర్యలకు వెనకాడనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఐడి సెల్ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, జ్వాలాపతి, కడప మండలవనరుల కేంద్ర సిబ్బంది, కరస్పాండెంట్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## కెరీర్ కౌన్సెలింగ్‌తోనే సరైన మార్గం

**ప్రజాశక్తి - కడప :** కెరీర్ కౌన్సెలింగ్ అనేది సరైన మార్గాన్ని ఎంచుకోవడంలో సహాయ పడేందుకు సాయం చేస్తుందని స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్, జైలు శాఖ అధికారి ఉదయ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెరీర్ కౌన్సెలింగ్‌లో ప్రొఫెషనల్ కౌన్సిలర్లు మార్గనిర్దేశం చేస్తారని, వారు వారు జాగ్రత్తగా రూపొందించిన మూల్యాంకన సాధనాలను ఉపయోగించడంతో పాటు మనలో ఉన్న నైపుణ్యాలు, లోపాలపై సలహాలను ఒదిస్తారని చెప్పారు. వ్యక్తి ఆసక్తులు, అర్హతలను జాగ్రత్తగా అధ్యయనం చేసిన తర్వాత, కెరీర్ కౌన్సిలర్లు వారి కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమం వల్ల విద్యార్థులు ఎలాంటి కెరీర్‌ను ఎంచుకోవాలో అవగాహన కల్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, సిబ్బంది, అబ్బాస్ అల్లి, టి. నాగయ్య, వి.వి. నారాయణ పాల్గొన్నారు.

## కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ అయ్యేలా చూడాలి

**ప్రజాశక్తి - కడప :** డిసెంబర్ 14న జిల్లావ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

## నోటీసులు వెనక్కి తీసుకోవాలి : టిడిపి

**ప్రజాశక్తి - ఒంటిమిట్ట :**



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద చెరువు గట్టు మీద ఇళ్లు నిర్మిం చుకున్న వారికి తహశీల్దార్ ఇటీవల నోటీ సులు అందజేశారని, వారు సుమారు 40 ఏళ్లుగా నివాసముంటున్నారని, నోటీసులు వెనక్కి తీసు కుని వారికి పట్టాలు మంజూరు చేయాలని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రమణమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా పేదలు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్నారని, ఇంతవరకు ఏ ప్రభుత్వమూ వారిని అక్కడ నుంచి వెళ్లి పొమ్మని చెప్పలేదని తెలిపారు. వారి వల్ల బస్టాండ్‌కు కానీ, చెరువుకు కానీ ఎలాంటి ఇబ్బంది లేదని తహశీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మామిళ్ళ ఈశ్వరయ్య, అడ్వకేట్ రామదాసు, మోదుగుల నరసింహులు, మామిళ్ళ కృష్ణయ్య, డాక్టర్ శివకుమార్, మాజీ స్కూల్ చైర్మన్ అజ్మీత్ బాషా, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ఇళ్ల యజమానులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో డ్రాయింగ్ పోటీలు

**ప్రజాశక్తి -కడప అర్బన్ :** ఉమ్మడి జిల్లాలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక యుటిఎఫ్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10న ప్రొద్దుటూరు, 17న బద్వేలు, రాజంపేట, పులివెందుల, 24న రాయచోటి చిత్రకళా పోటీలుంటాయన్నారు. పోటీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షులు సునీల్ కుమార్, కార్యదర్శి మల్లి, కోశాధికారి రమేష్ జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ , కడప బాలోత్సవం అధ్యక్షుడు జి. గోపాల్, జెవివి శివరాం సమావేశంలో పాల్గొన్నారు.

## వైవీయూ ఎంబిఎ పరీక్ష ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబిఎ, ఎంబిఎ హెచ్ఆర్ఎం నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శనివారం విసి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కృష్ణారావు, ఎంబిఎ విభాగ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడుతో కలిసి విడుదల చేశారు. తన ఛాంబర్‌లో ఫలితాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిఎ, ఎంబిఎ హెచ్ఆర్ఎంలో వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

## ప్రత్యేక చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి - కడప :** సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో శనివారం ప్యానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు, లీగల్ సర్వీ సెస్ సిబ్బందికి 'ప్రత్యేక చట్టపరమైన అవగాహన,శిక్షణ కార్యక్రమం' నిర్వహిం చారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ కేస్ మేనేజ్మెంట్ సిస్టం, లీగల్ సిస్టం మేనే జ్మెంట్ సర్వీసెస్, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, మండల, జిల్లా లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుంతల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

**ప్రజాశక్తి - కడప**

సికెదిన్నె : రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

జిల్లా వ్యాప్తంగా గోతులు పడిన రహదారు లకు మరమ్మతులు చేపట్టి గుంతల రహిత జిల్లాగా తీర్చిది ద్దుతామని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వై జంక్షన్ కూడలి వద్ద 'గుంతల రహిత రోడ్లు'లో భాగంగా అధికారులతో కలిసి కడప నియోజకవర్గంలో ఎన్‌హెచ్-18 కడప రేణిగుంటను కలిపే రహదారి దగ్గర ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణం కోసం రూ.290.40 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాకు 15.90 కోట్లు నియోజకవర్గాల వారిగా మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్‌సి జి.చంద్ర శేఖర్, ఇఇ నాగేశ్వర్‌రెడ్డి, డిఇలు ఎఇలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మండల పరిధిలోని కమ్మవారిపల్లె పంచాయతీలోని గొర్లపల్లె లో రూ. 15 లక్షలతో బిటి రోడ్ ప్యాచింగ్ పనులను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రోడ్ల పైన ప్రయా ణాలు అంటేనే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే వారని, ఎక్కడ చూసినా రోడ్లు గుంతలతో దర్శనమిచ్చేవని చెప్పారు. వాటిని పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపె ట్టారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ టి.వి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

**ప్రజాశక్తి - కడప :** ఏసిఎ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ గ్రూప్-బి టోర్నమెంట్‌లో శనివారం కెఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన విజయనగరం, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 377 పరుగులు చేసింది. రెండవ రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 89.5 ఓవర్లలో 376 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని బాబా తర్షిత్ 111, జి. జస్టిన్ 101 పరుగులు, విగ్నేష్ 64 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని రోహిత్ రెండు, లిఖిత రెండు, దేవ స్కంద రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు అదిక్యత సాధించింది.

వైఎస్ఆర్ఆర్, ఏసిఎ క్రికెట్ మైదానంలో కృష్ణా, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో కృష్ణా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 115 పరుగులు చేసింది. మూడు వికెట్లు నష్టానికి 102 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 84.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. అనంతరం 2వ ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు ఆట ముగిసే సమయానికి 46.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 164 పరుగులు చేసింది. ఒక వికెట్ నస్టానికి 137 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టానికి 353 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 40.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు ఆధిక్యత సాధించింది.

## కత్తిరింపు

ప్రజా'దృష్టి'

జిల్లాల్లో కరువు..కత్తిరింపులకు గురైంది. కడప, అన్నమయ్య జిల్లాలోని 66 మండలాల పరిధిలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. 19 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. మిగిలిన 47 మండలాలను గాలికి వదిలేసింది. ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి వర్షపాతలేమి వేదింపులకు గురిచేస్తోంది. కరువు పరిస్థితులను అంచనా వేయడానికి సంబంధించిన ఐదారు పారా మీటర్ల ఆధారంగా కరువును గుర్తించడం పరిపాటి. 2024-25 ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం కరువు మండలాలను నోటిఫై చేసింది. కడప జిల్లాలోని 36 మండలాలు, అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు వెరసి 66 మండలాల్లో 33 మండలాల్లో కరువు ఛాయలు స్పష్టంగా కనిపించడం గమనార్హం. ఇందులో కడప జిల్లాలో 10 మండలాల్లో వర్షపాత లేమి కనిపించింది. అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో వర్షపాత లేమి కారణంగా పంటలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షపాత లేమి, పంటల సాగు తగ్గుదల, ఎండుతున్న పంటలు, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనుల పెరుగుదల, పశువులు కబేళాలకు తరలింపు, పశుదాణా తదితర పారామీటర్లను దృష్టిలో ఉంచుకుని కరువు మండలాలను గుర్తించినట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో వర్షపాత లేమి, పంటల సాగు విస్తీర్ణం తగ్గుదల వంటి పలు పారామీటర్ల ఆధారంగా కడప జిల్లాలోని 36 మండలాల్లో సుమారు 10 మండలాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఇటువంటి క్షామ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో కడప జిల్లాలో కరువు మండలాలను గుర్తించాల్సి ఉంది. ప్రభుత్వం కడప జిల్లాలోని 36 మండలాల్లోని వర్షపాత లేమి, పంటల సాగు తగ్గిన ప్రాంతాలను కరువు మండలాల పరిధిలో చేర్చకపోవడం విస్మయాన్ని కలిగించింది. గతేడాది వైసిపి సర్కారు కడప జిల్లాలో నెలకొన్న క్షామ పరిస్థితులను గుర్తించి కరువు మండలాలను గుర్తించడంలో నిరాధరణకు గురిచేసింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో ఎన్డీయే సర్కారు అన్నమయ్య జిల్లాలో పంటలు సాగు తగ్గిన నాలుగు మండలాలను తగ్గించడం, కడప జిల్లాను పూర్తిగా నిరాదరణకు గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన రైతు సంఘాల నాయకులు కరువు మండలాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తున్నారు. కరువు మండలాల గుర్తింపు నేపథ్యంలో సంబంధిత మండలాల రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉంటుందో ఎవరికీ తెలియడం లేదు. సాధారణంగా కరువు పరిస్థితులు నెలకొన్న జిల్లాల్లో రుణాలు రీషెడ్యూల్ చేయడం, ఇన్సూరెన్స్ అమౌంట్ చెల్లింపుల్లో మినహాయింపు ఇవ్వడం, ఇన్సూరెన్స్ విడుదల చేయడం మొదలగు అంశాలను పరిగణలోకి తీసుకోవడం తెలిసిందే. తాజా కరువు మండలాల గుర్తింపు నేపథ్యంలో ప్రభుత్వం బాధిత రైతులకు ఎటువంటి మినహాయింపులు వర్తింపజేయనుందో వేచిచూడాలి.

**- ప్రజాశక్తి- కడప ప్రతినిధి**

మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

## ఆ కథనాలు అవాస్తవం : 'రాచమల్లు'

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

కొద్దిరోజులుగా ప్రముఖ టివి చానెల్స్‌లో మున్సిపల్ చైర్మన్ పదవి టిడిపికి కైవశం అవుతుందంటూ వస్తున్న వార్తలు అవాస్తవాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చైర్మన్ పదవిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందకు 2025 మార్చి 18 నాటికి నాలుగేళ్లు ముగుస్తుందన్నారు. నాడు 40 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంఎతో కలుపుకొని 43 ఓట్లు ఉంటాయని, 29మంది కౌన్సిలర్లుగాని అంతకు మించి ఉంటేనే కౌన్సిల్ రద్దు అవుతుందని ఆయన వివరించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను తొలగించాలంటే ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో టిడిపికి 29మంది సభ్యులు అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం టిడిపి కౌన్సిలర్ల బలం19గా ఉందన్నారు. తాము గత ఎన్నికల్లో ఓటమి చవి చూసినప్పటికీ తన వెంట 22 మంది కైన్సిలర్లు ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు నిలిచినందుకు అభినందిస్తున్నానన్నారు. రాన్నున్న మున్సిపల్ ఎన్నికల్లో తన వెంట ఉన్న 22మంది కౌన్సిలర్లకు తప్పక కౌన్సిల్ టికెట్ ఇస్తానని భరోసా ఇచ్చారు. వైసిపి అధికారంలో ఉండగా పార్టీ ద్వారా కౌన్సిలర్లుగా గెలిచిన 11 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వీరికి టిడిపిలో కూడా టికెట్ ఇచ్చే అవకాశం లేదని రాచమల్లు తలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి, వైస్ చైర్మన్ ఖాజామోహిద్దీన్ (ఆయిల్‌మిల్ ఖాజా), పలువురు వైసిపి కైన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ సిలిండర్ ఓ నాటకం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ఉచిత సిలిండర్లు ఓ పెద్ద నాటకమని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉచిత గ్యాస్ వాగ్దానం ఒక బూటకమన్నారు. రాష్ట్రంలో గ్యాస్ కనెక్షన్ల రూపంలో ప్రస్తుతం తెల్లరేషన్ కార్డులు కలిగి ఆధార్ కార్డుతో అనుసంధానమైన వారు మొత్తం కోటి 48 లక్షలు కాగా, ఉచిత కనెక్షన్లు కోటి ఎనిమిది లక్షల మందికి మంజూరు చేశారన్నారు. సాకులు చూపి 40 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు రాకుండా చేయడం కూటమి ప్రభుత్వ మోసం కాదా అని ప్రశ్నించారు. ఉచితమన్నప్పుడు ప్రజలకు నేరుగా ఏ నాయకుడైనా ఉచితంగా ఇవ్వాలన్నారు. సిలిండర్‌కు ముందుగా నగదు చెల్లించిన 48 గంటల్లో మళ్లీ వారి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తామనడం సరైందికాదన్నారు.

బాణాసంచా వితరణ చేస్తున్న ఓబులేసు

## వసతి గృహంలో బాణాసంచా వితరణ

**ప్రజాశక్తి - ముద్దనూరు**

దీపావళి పండుగ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ గిరి కాలనీకి చెందిన వార్డు సభ్యులు ఓబులేసు శనివారం సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు బాణాసంచా వితరణ చేశారు. వార్డెన్ మనోహర్, విద్యార్థులు దాత ఓబులేసుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పిల్లలు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

## అన్నదాన సత్రానికి స్టీల్ సామగ్రి అందజేత

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని అల్లాడుపల్లె భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రానికి నరహరిపురానికి చెందిన వీరు సుబ్బారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు స్టీల్ సామగ్రి అందజేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మేకల మారుతి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ రూ.25వేలు విలువ చేసే సామగ్రిని అన్నదాన సత్రానికి వితరణ చేయడం సంతోషమన్నారు. వీటిలో ఎలక్ట్రికల్ గ్రైండర్, వంట సామన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నారాయణ యాదవ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి సామగ్రి అందిస్తున్న దాతలు

# క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**ప్రజాశక్తి - సిద్ధవటం**

మండల పరిధిలో కడప-చెన్నై జాతీయ రహదారి జెఎంజె కాలేజి సమీపంలో కోతుల తూము వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఒకరు అక్కడికక్కడే చనిపోగా, మరో వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. తిరుపతి నుండి పులివెందుల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు కడపకు వస్తుండగా, కడప నుండి రాజంపేటకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అన్నమయ్య జిల్లా ఇసుకపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్(19) అక్కడికక్కడే మృతి చెందాడు. రోహిత్ కుమార్ (20) బలమైన గాయాలు తగలడంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో బోల్తా : యువకుడికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ఆటోలో ఎరువులు దించేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా బొందలకుంట సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరవేటిపల్లె శ్రీనివాసులు ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన ఆటోలో డ్రైవర్, మరో ముగ్గురు యువ కూలీలు ఎరువులు లోడు దించేందుకు బొందలకుంట గ్రామానికి వెళ్లారు. ఎరువులు దించేసి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ పక్కన కూర్చుని ఉన్న ఆరవేటిపల్లె శ్రీనివాసులుకు ఎడమ కాలు విరిగింది. 108 సిబ్బంది ఇఎంటి మహేష్, పైలెట్ పవన్ కుమార్ ప్రథమ చికిత్స చేసి, జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# మాకెందుకు నీళ్లివ్వరూ..!

## 20 రోజులైనా నీళ్లు వదలలేదు - ఒక్క ట్యాంకర్ నీళ్లు ఎలా సరిపోతాయి

బిందెలతో ఆందోళన చేస్తున్న క్రిస్టియన్ లైన్ ప్రజలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

మాకెందుకు నీళ్లివ్వరని పట్టణంలోని క్రిష్టియన్ లైన్ ప్రాంతానికి చెందిన మహిళలు రోడ్డెక్కారు. 20రోజులవతున్నా.. నీరివ్వలేదని, ఒక్క ట్యాంకర్ నీళ్లు ఎలా సరిపోతాయంటూ శనివారం ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున బిందెలు చేతపట్టుకుని ఆందోళనకు దిగారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ప్రయోజనం లేదని వాపోయారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే సక్రమంగా నీళ్లు వదులుతున్నారని తెలిపారు. కేవలం తాము తక్కువ కులమైనందుననే నీళ్లు వదలలేదని ఆరోపించారు. నీటిని డబ్బుతో కొంటున్నామన్నారు. ఇలాంటి పరిస్థితిని తామెప్పుడూ చూడలేదన్నారు. వర్షాలు బాగా పడి పుష్కలంగా నీళ్లు ఉన్నా కూడా తమకు వదలలేదంటే మాపై చిన్న చూపే కదా అని వారు ప్రశ్నించారు. కనీస వసతులు కల్పించలేని నాయకులు, అధికారులు ఎందుకని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**నీటి సమస్య లేకుండా చూస్తాం : మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్**

క్రిస్టియన్ కాలనీలో నీటి సమస్య లేకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం క్రిస్టియన్ కాలనీలో ప్రజలు రోడ్డుపె ఆందోళన చేయడంతో.. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఆ ప్రాంతానికెళ్లి వారితో మాట్లాడారు. రెండు రోజులకు ఒకసారి నీళు ఖచ్చితంగా చేస్తామన్నారు. ట్యాంకర్ల అవసరం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కాలనీకి నీళ్లు వదిలే ఉద్యోగి సుబ్రమణ్యం సరిగా పనిచేయకనే సమస్య వచ్చిందన్నారు. ఆ ఉద్యోగిని తొలగించామని, ఇకనుంచి సక్రమంగా నీళ్లు సరఫరా చేస్తామని చైర్మన్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్ ఉన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

## ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత

**- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత అనే సామెతలా ఉంది కూటమి ప్రభుత్వ వాలకమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా శనివార ఆయన విలేకరులతో మాట్లాడుతూ మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు దొంగిలించినట్లుంది టిడిపి కూటమి పాలన అని ఎద్దేవా చేశారు. ఉచిత గ్యాస్ పథకం పేరుతో ప్రభుత్వం ఏడాదికి ప్రజలకు ఇస్తున్నది రూ.2,684 కోట్లు కాగా.. కరెంటు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుండి లాక్కుంటున్నది రూ.6,073 కోట్లు అన్నారు. ఇదికాక మరో సారి సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.11826 కోట్లు అదనపు భారం మోపబోతున్నట్లు చెప్పారు. మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం ఉచిత గ్యాస్ పథకం అమలు కావడం లేదన్నారు. ప్రతి ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని చెప్పారన్నారు. రాష్ట్రంలో 180 లక్షల కుటుంబాలు ఉండగా, అందులో 154 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. 154 లక్షల గ్యాస్ కనెక్షలకు ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే ఏడాదికి రూ.4000 కోట్లు కావాలన్నారు. కానీ ప్రభుత్వం రూ.2,684 కోట్లు మాత్రమే ఇస్తోందన్నారు. దీన్ని బట్టి ఉచిత గ్యాస్ పథకం కోటి కనెక్షన్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. 54 లక్షల కనెక్షన్లకు వర్తించడం లేదని స్పష్టంగా తెలుస్తోందని ఆయన వివరించారు. మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతి ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కరెంటు సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించాలని కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తులసిరెడ్డి తెలిపారు.

## విద్యాలయాల పరిధిలో బ్రాందీ షాపులు తగదు

డిటికి వినతిపత్రమిస్తున్న విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

పట్టణంలో విద్యాలయాలకు 100 మీటర్ల పరిధి నిబంధనలు పాటించకుండా బ్రాందీ షాపులు ఏర్పాటు చేయడం తగదని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం డిటి సాయినాథ్ శర్మకు వినతి పత్రం అందజేశారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజ్ వద్ద 100 మీటర్లు ఎక్సైజ్ శాఖ నిబంధనలు పాటించకుండా సింధూరి వైన్స్, అక్కడే సిట్టింగ్ రూములను ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేస్తున్నారని తెలిపారు. 25ఏళ్లుగా ఇక్కడ విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని విచారించి బ్రాందీ షాపు ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అధికారులు పర్మిషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. వెంటనే ఆ బ్రాందీ షాపును తొలగించాలన్నారు. పాత బస్టాండ్ ప్రాంతంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వెనుక పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న మసీదుకు దగ్గరగా ఏర్పాటు చేసిన భారత్ వైన్స్, బొల్లవరంలో ఆదిత్య పాఠశాల, సరస్వతి విద్యా మందిరం దగ్గర జాను బ్రాందీషాపు, భగత్ సింగ్ కాలనీలో టివిఆర్ స్కూలు, పెద్దమ్మ గుడి ప్రాంతాల్లో ప్రొద్దుటూర్ వైన్స్ నిబంధనలు పాటించని బ్రాందీ షాపులను పెంచి పోషిస్తున్న ప్రొద్దుటూర్ ఎక్సైజ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు ఓబులేసు కత్తి, గడ్డం నరసింహులు మాదిగ, రమేష్, బెనర్జీ, చెన్నమ్మ, ఆనంద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలు, బయన్న, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### గుడి, బడి ప్రాంతాల్లో వైన్ షాపులు దారుణం

**- రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరు ఎక్సైజ్ పరిధిలోని మండల పరిధిలో వైన్ షాపులు గుడి, బడికి 100 మీటర్ల తర్వాత ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నా, దాన్ని అమలు పరచాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరించడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారో లేక, అనధికారికంగా ప్రయివేట్ వ్యక్తుల ద్వారా జీతాలు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. బెల్టు షాపుల మీద చర్యలు తీసుకోవడంలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చిన తర్వాత ప్రొద్దుటూరులో పలు ప్రాంతాల్లో నిరసనలు, వినతిపత్రాల ద్వారా ఎక్సైజ్ శాఖకు విన్నవించాని ఫలితంలేదన్నారు.నిబంధనలు వ్యతిరేకిస్తే షాపుల రద్దుకు వెనకాడబోమని ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో అర్థం ఏంటో తెలియడంలేదన్నారు.

## ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ వాసవి మాతను శనివారం ధనలక్ష్మిదేవిగా అలంకరణ చేశారు. ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన, మంగళ హారతి, కుంకుమ పూజ చేశారు. శ్రీ వాసవి మాతకు రూ.5.50లక్షలు కరెన్సీ నోట్లుతో ధనలక్ష్మిదేవిగా అలంకరణ చేశారు. స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఆర్యవైశ్య మహిళ మండలి అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, ఓంశాంతి నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్య, ఆర్యవైశ్య నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు

తొలగించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ప్రయివేటు పాఠశాలకు వెళ్లేందుకు ఎల్ఎమ్ కాంపౌండ్, ఎస్వీ గిరి కాలనీ విద్యార్థులు, మహిళలు రైలు పట్టాలు దాటి ఈ దారిలో వెళుతుంటారని తెలిపారు. మందు బాబులు ఈ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నారని గుర్తించి వారికి ఇబ్బంది కలగకుండా కంపచెట్లు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల సమీపంలో జనావాసాల మధ్య మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 'స్వామి వివేకానంద' విద్యార్థి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

సి.జగన్మోహన్

పట్టణంలోని శ్రీస్వామి వివేకా నంద పాఠశాలలో 8వ తరగతి చదు వుతున్న సి.జగన్మోహన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక య్యారని పాఠశాల డైరెక్టర్ సోమశేఖరరెడ్డి తెలి పారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతనెల 24న కడపలో జరిగిన జిల్లాస్థాయి హాకీ పోటీల్లో ఈ విద్యార్థి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. కడప జిల్లా నుండి రాష్ట్రస్థాయికి ఎం పిక కావడం పట్ల సోమశేఖరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## అల్లాడుపల్లెలో కార్తీకదీపం ఏర్పాటు

**ప్రజాశక్తి - చాపాడు**

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె దేవళాలలో కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా గజ స్తంభానికి పూజలు నిర్వహించి, కార్తికదీపాన్ని ఏర్పాటు చేశారు. కార్తీకమాసం పూర్తయ్యే వరకు దీపం వెలుగుతూ ఉంటుందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరేంద్ర, చిన్నా, గోవిందు స్వాములు పాల్గొన్నారు.

## సజావుగా పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సజావుగా జరిగిందని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5,377 పెన్షన్ల ఉండగా, 16 మంది ఇతర కారణాలతో అందుబాటులో లేరన్నారు. మిగిలిన అందరికీ పెన్షన్లను పంపిణీ చేశామన్నారు. ఉదయం కొద్దిసేపు సాంకేతిక లోపం కారణంగా పంపిణీ కొంచెం ఆలస్యమైందన్నారు.

## భవన నిర్మాణానికి ఎస్‌బిఐ ఉద్యోగుల చేయూత

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

స్థానిక నూతన బస్టాండు ప్రాంతంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి పులివెందుల స్టేట్ బ్యాంక్ (మెయిన్) ఉద్యోగులు రూ.10,016 అందజేశారు. ఆ మేరకు శనివారం స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్యామల్ రావ్, డిప్యూటీ మేనేజర్ కార్తీక్, లోకల్ సెక్రటరీ ఓబులేసు చేతులమీదుగా మొత్తాన్ని సేవాసమితి అధ్యక్షులు రాజుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు గంగాధర్ రావ్, నరసింహులు, సుధాకర్, విక్టర్, విజయలక్ష్మి, అనూష, శిరీష పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న ఎస్‌బిఐ సిబ్బంది

## ప్రత్యేక ప్రణాళికతో బోధించాలి

**ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)**

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో బోధించాలని బద్వేల్ డివిజన్ డిప్యూటీ డిఇఒ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంఇఒ పద్మలత, ప్రధానోపాధ్యాయుడు గోశెట్టి రామమోహన్, సీనియర్ ఉపాధ్యాయులు మీసాల మునెయ్య, ఆవుల శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఇఒ

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగేలా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి హెచ్చరించారు. చెన్నారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఏపుగా పెరిగిన కంప చెట్లను శనివారం సిఐ ఆధ్వర్యంలో జెసిబి యంత్రంతో తొలగించారు. అక్కడున్న ఖాళీ మద్యం సీసాలు, నీళ్ల ప్యాకెట్లు

లింగాల చెరువుకు నీటిని విడుదల చేస్తున్న బిటెక్ రవి

## కృష్ణా జలాలతో సాగునీరు

**ప్రజాశక్తి - లింగాల**

కరువు నేలను సస్యశ్యామలం చేసేందుకు లింగాల కూడి కాల్వ ద్వారా కృష్ణా జాలలను వినియోగిస్తున్నట్లు పులివెందుల టిడిపి బాధ్యుడు బిటెక్ రవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కూడి కాల్వ ద్వారా ఎత్తిపోతల పథకం నుంచి లింగాల చెరువుకు నీటిని అందించే మోటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ లింగాల కూడి కాల్వ ద్వారా మండల పరిధిలోని అన్ని చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టామన్నారు. సాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు కూడా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామరు. కరువును పారదోలే విధంగా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అక్కడికి వచ్చిన రైతుల సమస్యలను ఆయన తెలుసుకున్నారు అనంతరం మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్‌ను సందర్శించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలని గ్యాస్ డీలర్ రాంబాబుకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల బాధ్యులు సంజీవరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పార్నపల్లె ధనుంజయ నాయుడు, మహే శ్వరరెడ్డి, మండల నాయకులు, డిఇఇ చైతన్యరెడ్డి, ఎఇ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ : బిటెక్ రవి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ రానుందని పులివెందుల నియోజవర్గ టిడిపి ఇన్‌చార్జి మా రెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి( బీటెక్ రవి) తెలిపారు. మండలంలోని నిడువెలగల నుంచి హిమకుంట్ల మధ్యలో రోడ్ ప్యాచ్ వర్క్ పనులకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ నియోజవర్గంలో గుంతలు పడిన రోడ్లను మరమ్మతు పనులు చేయిస్తామన్నారు. ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు మరెడ్డి జోగిరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులతో లబ్ధిదారులు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

## పేదలకు వరం సిఎం సహాయ నిధి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.29 లక్షలు చెక్కులను బాధితుల కుటుంబాలకు శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అందజేశారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన నియోజకవర్గానికి చెందిన 28 మంది అనారోగ్యానికి గురై వివిధ హాస్పిటల్లో చికిత్స చేయించుకున్నారు. వీరికి ఎమ్మెల్సీ చెక్కులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాంగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## భగత్‌సింగ్ ఆశయాలను సాధిస్తాం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్)**

డివైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980లో పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో అందరికీ విద్య-అందరికీ ఉపాధి అనే నినాదంతో ఆర్థిక, సామాజిక, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో పని చేయాలని డివైఎఫ్ఐ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు ఓబులేసు, మోహన్, దస్తగిరి, ప్రదీప్, యువత పాల్గొన్నారు.

### ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా పోరాటాలు

**కడప అర్బన్ :** అందరికీ ఉద్యోగ ఉపాధి లక్ష్యంగా డివైఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందని జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ తెలిపారు. శనివారం డివైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడప ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాటాడుతూ డివైఎఫ్ఐ 1980, నవంబర్ 1,2,3 తేదీలలో పంజాబ్ రాష్ట్రంలో ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు నిరుద్యోగ యువత పక్షాన నిలబడి అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. జాతి ఐక్యత కోసం నిలబడి, మతోన్మాదాన్ని ఎదిరించి, 'మా దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వం' అనే నినాదంతో ముందుకు సాగుతుందని తెలిపారు. రైల్వేలో రిటైర్డ్ అయిన వారికి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేస్తూ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తుందని పేర్కొన్నారు. విభజన హామీలు ఒక్కటి కూడా ఆంధ్ర రాష్ట్రానికి అమలు చేయ కుండా మొండి చెయ్యి చూపుతున్నారని వాపోయారు. వెనుక బడిన రాయలసీమ కరువుతో, వలస లతో,అల్లాడుతుంటే ఇక్కడ ఉపాధి పరిశ్ర మలు ఏర్పాటు చేయకుండా, ఉన్న ఉక్కు పరిశ్రమ హామీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కరువులు, వలసలు ఆగాలంటే కడప ఉక్కు పరిశ్రమే ఏకైక మార్గమన్నారు. రాబోవు రోజులలో కడప ఉక్కు సాధననే లక్ష్యంగా రాష్ట్ర వ్యాపితంగా, ఢిల్లీ స్థాయిలో యువతను కలుపుకుని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్, సమీర్, భాస్కర్,చార్లెస్ పాల్గొన్నారు.

## నాబార్డు ద్వారా రైతులకు శిక్షణ

**- నాబార్డు డిడిఎం విజయవిహారి**

**ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)**

నాబార్డు ద్వారా రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నాబార్డు డిడిఎం విజయవిహారి పేర్కొన్నారు. మైదుకూరు మండల పరిధిలోని వనిపెంట వద్ద కెవికెలో శనివారం నా బార్డ్ ద్వారా రైతులకు శిక్షణ, అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవిహారి మాట్లా డుతూ ఆయా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. ప్రతి ఎఫ్‌పిఒ వారి మండలాల్లో సర్వసభ్య సమావేశాన్ని ప్రతి సంవత్సరం నిర్వ హిం చాలని సూచించారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల కృష్ణ మాట్లాడుతూ మండలాల ఎఫ్‌పిఒలు నాబార్డు సేవలను తమ పరిధిలోని రైతులకు వివరించాలన్నారు. కెవికె ద్వారా రైతులకు అందుతున్న సేవలను ఆయన వివరించారు. పండించిన పంటలను మార్కెటింగ్ ఏ విధంగా చేసుకోవాలి.. అభ్యుదయ సంఘాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విద్యారాణి, ఆదర్శ రైతు బి.ప్రతాప్‌రెడ్డి, దువ్వూరు, పోరు మామిళ్ల, కాశినాయన, బి.కోడూరు, కలసపాడు సంఘాల రైతులు పాల్గొన్నారు.

**రాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప**

**O.S.No. 15/2021**

కెనరా బ్యాంకు (పూర్వపు సిండికేట్ బ్యాంకు), 7 రోడ్డు బ్రాంచి, బైఇట్స్ చీఫ్ మేనేజరు.

...వాది

Vs

1. ఇండ్ల చెన్నారెడ్డి, S/o చెన్నారెడ్డి, 46 సం॥లు, బిజినెస్.
2. ఇండ్ల రమణమ్మ, W/o ఇండ్ల చెన్నారెడ్డి, 42 సం॥లు, గృహిణి.

1&2 లనివాసం, డోర్‌నెం.65/95/10, ఎస్‌బిఐ కాలనీ, మరియాపురం, కడప సిటి.

...ప్రతివాదులు

దావా సమను

పై తెలిపిన వాది బ్యాంకు వారు మీ నుంచి రుణబాకీ మొత్తం రూ.17,36,998.84 పై॥ రాబట్టుటకై దాఖలు చేసిన పై దావా పై కోర్టులో 13.11.2024వ తేదీన వాయదా ఉన్నది. ఆ దినం ఉ॥10.30 గం॥లకు మీరు స్వయంగా గానీ, లాయరు గారి ద్వారా గాని ద్వారా పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోనంతట దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు ఉత్తర్వుల మేరకు//

**డి.లక్ష్మీనారాయణ**

వాది బ్యాంకు పరం వకీలు